క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



కొత్తపల్లి: మండల పరిధిలోని గొర్లోని బాయి గ్రామ పంచాయతీలోని గొల్లగడ్డ గ్రామంలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అల్లీపూర్ మాజీ సర్పంచ్ రమేశ్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణయ్య కృషితో కాడా ప్రత్యేక నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు కావడంతో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి చొరవతో అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దుప్పటి గట్టు తిరుపతి రెడ్డి, సవారి శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబసభ్యుల నిరసన



మక్తల్: ఊట్కూర్ మండలం చిన్న పొర్ల గ్రామానికి చెందిన కర్ని అమ్మణ్ణ అనే వ్యక్తి ఈనెల 1న మక్తల్ మండలం లింగంపల్లి సబ్ స్టేషన్ రోడ్డు దగ్గర ట్రాక్టర్ ఢీకొని మరణించిన విషయం తెలిసిందే. అయితే అమ్మణ్ణ మృతికి లింగంపల్లికి చెందిన మొలాలే కారణమని మృతుడి కుటుంబ సభ్యులు శనివారం మొలాలి ఇంటి ముందు టెంటు వేసుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం మక్తల్ ఎస్ఐకు తెలియడంతో అక్కడికి చేరుకొని ఏదైనా అన్యాయం జరిగితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని నచ్చజెప్పి వారిని అక్కడి నుండి పంపించి వేశారు. అయితే అమ్మణ్ణ కుటుంబ సభ్యులు మాత్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకుండానే వెళ్లిపోయారు.

లోకాయుక్తతో విచారణ జరిపించాలి

మరికల్: మండలంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకొని అధికారులపై లోకాయుక్త ద్వారా విచారణ జరిపించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని మాధవరం, పల్లెగడ్డ, పూసల్‌పహాడ్ గ్రామాల శివారులో ఉన్న గుట్టలను ధ్వంసం చేసి మట్టిని అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు ఎర్రమట్టి దందాలో రూ.లక్షలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు మట్టి దందాకు కొమ్ముకాస్తున్న అధికారులపై లోకాయుక్త ద్వారా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించండి



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామంలో శనివారం ఎస్ కె ఎం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి రాము మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలు పత్తి, ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విదేశాల నుంచి పత్తి పంటను దిగుమతి చేయడం ద్వారా భారతదేశంలో పత్తి పంట పండించే రైతులు గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్నారని వాపోయారు. సరియైన ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి దిగుమతులపై కేంద్రం ప్రభుత్వం ఏదైతే సుంకాలు ఎత్తివేసిందో ఆ సుంకాలను యధావిధిగా కొనసాగించి రైతులకు మద్దతు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యాదగిరి, దస్తప్ప, మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

సుంకాన్ని తగ్గించడం సరికాదు

మద్దూరు: కేంద్ర ప్రభుత్వం పత్తి రైతులకు వ్యతిరేకంగా పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం సుంకాన్ని ఎత్తివేయడం సరికాదని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు అన్నారు. వెంటనే దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ మహేష్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొండ నర్సిములు, మల్లేష్, బస్వరాజ్, రాజు తదితరులున్నారు.



పరుశ రాముడి రూపంలో వచ్చిన గణనాథుడితో భీష్ముడు అలంకరణలో అశోక్ నగర్ వినాయకుడు..



మరికల్‌లో నాగస్వరం, వాయిద్యాలతో నిమజ్జన వేడుకలు



ధన్వాడలో వినాయకుడి శోభాయాత్ర



అమ్మపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న ఏకదంతుడు

గణనాథుడికి ఘన వీడ్కోలు



ఊరేగింపులో భారీ గణనాథుడు

ధన్వాడ: మండలంలో శనివారం వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శ్రీరాం నగర్‌లో ఏర్పాటు చేసిన ఆపరేషన్ సిందూర్ డెకరేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మరికల్: మండల కేంద్రంలో పదకొండు రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథులు శనివారం భక్తిశ్రద్ధలతో గంగమ్మ ఒడికి చేరారు.

మాగనూర్: మండలంలోని అమ్మపల్లి తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథులను శనివారం నిమజ్జనం చేశారు. అమ్మపల్లిలో లడ్డును రూ. 51 వేలకు గ్రామానికి చెందిన గుడిసె తిమ్మప్ప దక్కించుకున్నారు.

మరికల్: నాయిబ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగస్వరం వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ గణేశుడిని జూరాలలో నిమజ్జనం చేశారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు

నర్వ: మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన గణనాథులను స్థానిక కాంగ్రెస్ నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. తొమ్మిది రోజులుగా పూజలందుకున్న గణనాథులను శనివారం నిమజ్జనానికి తరలించారు.

సీసీ కెమెరాల నిఘాలో శోభాయాత్ర

నారాయణ పేట క్రైమ్: జిల్లా కేంద్రంలో గణేశ్ శోభాయాత్రలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్పీ కార్యాలయంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి సీసీ కెమెరాలను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. గణేశ్ మార్గంలో ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయినా, బందోబస్తు అవసరం ఉన్నా వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నారు. శోభాయాత్రలో పాల్గొనే భక్తులు శాంతియుతంగా సాంప్రదాయ బద్ధంగా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.



మరికల్‌లో లడ్డు దక్కించుకున్న వ్యక్తి

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మక్తల్: పట్టణంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుడికి నైవేద్యం సమర్పించి పూజలు జరిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, మహిపాల్‌రెడ్డి, చిన్నహన్మంతు, విద్యుత్ ఏఈ మహేష్‌గౌడ్, ఈశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పూజల అనంతరం భక్తులతో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి: ఎస్పీ



నారాయణపేట క్రైం: గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడం ఆనందంగా ఉందని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. నవరాత్రి నిమజ్జనోత్సవాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మెయిన్ చౌక్ లో వీహెచ్‌పీ, నగర గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జన ఉత్సవాలలో నగర ఉత్సవ సమితి సభ్యులు, మండపాల నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకారం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎస్పీని వారు గౌరవ ప్రదంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

9న కంటి వైద్యశిబిరం

ఊట్కూరు: ఊట్కూరులోని గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఎనుగొండ కందూరు రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యబృందం సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరికైనా కంటిలో శుక్లాలు ఉంటే ఉచితంగా ఆపరేషన్ కూడా చేయిస్తామన్నారు. శిబిరానికి వచ్చే వారు ఓటర్‌కార్డు, రేషన్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.

క్రికెట్ చాంపియన్‌గా ‘మక్తల్ జెడ్పీహెచ్‌ఎస్’



మక్తల్: జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా మక్తల్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి డీఎస్‌ఓ వెంకటేశ్ శెట్టి చేతుల మీదుగా బహుతులు అందజేశారు. జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌లో భాగంగా శనివారం జడ్పీహెచ్ఎస్ స్కూల్, లిటిల్ యాంగిల్ స్కూల్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. మ్యాచ్‌లో మూడు పరుగుల తేడాతో మక్తల్ జడ్పీహెచ్ఎచ్ బాయ్స్ జట్టు విజయం సాధించగా డీఎస్‌ఓ వెంకటేశ్ శెట్టి ట్రోఫీ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్సియల్ డైరెక్టర్ లక్ష్మి నారాయణ, వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేశ్, రాఘవేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఈశ్వర్, రమేశ్, శ్రీరాములు, నరేశ్, భరత్ పాల్గొన్నారు.

నూతన మేనేజర్‌గా గోన్మీ

మాగనూర్: మండలం తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన మేనేజర్‌గా ఖాంపున గోన్మీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను బ్యాంక్ సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. రైతులు, ప్రజలకు సకాలంలో రుణాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని గోన్మీ తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నారాయణపేట రూరల్: పట్టణంలోని అనంతశయన దేవాలయంలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. భాద్రపద మాసం అనంత చతుర్దశిని పురస్కరించుకొని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, విశేష పుష్పాలంకరణ, స్వామి వారి వ్రతం, పల్లకీ సేవ, మహారథోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మహా నైవేద్యం సమర్పించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అంతకుముందు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పలువురు కళాకారులు, విద్యార్థినులు పాల్గొని భక్తి పాటలకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

కృష్ణా: ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను శనివారం హిందుపూర్ ఆంజనేయులు, కృష్ణా గ్రామానికి చెందిన భీంసీ, మంజునాథ్‌ల ఆధ్వర్యంలో గ్రామ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, అందుకే వారిని ఎప్పుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కిషోర్, ఉపాధ్యాయులు నాగరాజు,రాఘవేంద్ర,అనిల్ కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మద్దూరు: మండల ఎమ్మార్పీ అధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓ బాలకిష్టప్ప, తహసీల్దార్ మహేష్‌గౌడ్‌లు సన్మానించారు. వెంకట్‌రాంరెడ్డి, జీహెచ్ఎం, బాలజీ , సూర్య, రాజరత్నం, సురేఖ, శోభారాణి, సుభాషిణి, సంగీత ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికకావడంతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో పేదలందరికీ న్యాయం

మక్తల్: కాంగ్రెస్ పాలనలో పేదలందరికీ న్యాయం జరుగుతుందని మక్తల్ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. శనివారం ఖానపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. గ్రామంలో 300 మందికి ఇళ్లు మంజూరు అయ్యాయని, లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కట్టవెంకటేశ్, అబ్దుల్ రహిమాన్, హన్మంతు, బోయ వెంకటేశ్, రమేశ్, దండురాము, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను శనివారం ఎంపీడీఓ కొండన్న లబ్దిదారులకు అందజేశారు. గ్రామంలో శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామానికి మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారందరు నిర్మాణ పనులను తర్వగా ప్రారంభించాలన్నారు. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం నుంచి లబ్ధిదారుడికి రూ.5 లక్షల సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ పావని, కార్యదర్శి జ్యోతి, అంజిరెడ్డి, కేశవులు పాల్గొన్నారు.



మరికల్‌లో ఇళ్ల పత్రాలతో లబ్ధిదారులు

పారిశుద్ధ్యం, వీధిలైట్ల సమస్యను పరిష్కరించండి

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య, వీధిలైట్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం యాంకి గ్రామంలోని పారిశుద్ధ్య పనులు, వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఏడాది కాలంగా మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై జిల్లా పంచాయతీ అధికారిని కలిసి విన్నవించినా నేటికీ పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో పంచాయతీల్లో చేపట్టే పనులకు నిధులు లేక అప్పులు చేశామని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించి నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీఓను కలిసిన వారిలో యాంకి గ్రామస్తులు చెన్నప్ప, అంజన్న, శ్రీనివాస్, కురుమన్న, దాసు తదితరులున్నారు.

వాహనం ఢీకొని ఎద్దు మృత్యువాత

మాగనూర్: గుడెబాల్లూర్ శ్రీ లక్ష్మి వెంటేశ్వర స్వామి దేవాలయానికి చెందిన కాడెద్దు మృత్యువాత పడింది. శనివారం తెల్లవారు జామున మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఎద్దు మరణించింది. విషయం తెలుసుకున్న దేవాలయం కమిటీ సభ్యులు ఎద్దుకు హిందూ సంప్రదాయ పద్ధతిలో పూజ కార్యక్రమాలు నిర్వహించి స్థానిక పెద్దవాగులో పూడ్చివేశారు. వాహనాలు అతివేగంగా వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సామాజిక పింఛన్లను పెంచాలి



మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితర వారికి ఇస్తున్న పింఛన్లను పెంచాలని ఎమార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు కోరారు. శనివారం వారు మాట్లాడుతూ పింఛన్ల ఇచ్చే నగదు సాయాన్ని పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు నగదు సాయాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 20 నెలలు గడుస్తున్నా పింఛన్ల పెంపు కార్యక్రమం చేపట్టకపోవడంతో ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈనెల 8న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్, అనుబంధ సంఘాల నాయకులు రాములు, ప్రవీణ్‌కుమార్, కృష్ణ, గోపాల్‌గౌడ్, సాయిలు, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాదేశిక ఎన్నికల ఓటరు జాబితా విడుదల

కొత్తపల్లి: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓటరు జాబితాను శనివారం కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ కృష్ణారావ్ విడుదల చేశారు. మండలంలోని 1 జెడ్పీటీసీ, 5 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను విడుదల చేశారు. 32 పోలింగ్ స్టేషన్లకు పురుష ఓటర్లు 8159, మహిళలు 8600 ఒకరు థర్డ్ జెండర్‌తో మొత్తం 16,760 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 8వ తేదీలోపు తెలియజేయాలన్నారు.

మాగనూర్: ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మాగనూర్ ఎంపీడీవో శ్రీనివాసులు పర్యవేక్షణలో తుది ఓటర్ జాబితాను పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో కారోబర్ అశోక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మండంలోని 39 గ్రామ పంచాయితీలకు చెందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటరు లిస్టును గ్రామ కార్యదర్శులు విడుదల చేశారు. ఈ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 8వ తేదీలోపు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చన్నారు.

8న పార్టీ నాయకులతో సమావేశం

ఊట్కూరు: రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ మేరకు మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ఓటరు జాబితాను ఎంపీడీవో ధనుంజయ్య గౌడ్ శనివారం విడుదల చేశారు. ఈ జాబితాపై మండల పరిషత్ భవనంలో సోమవారం అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు.

10న తుది జాబితా విడుదల

మద్దూరు: మండలంలోని 10 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానాలకు ఓటర్ల జాబితాను శనివారం మండల పరిషత్ కార్యలయంలో అధికారులు ప్రదర్శించారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 26,370 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు, 12,900 మంది స్త్రీలు 13,470 మంది ఉన్నారన్నారు. ఈ నెల 10న ఫైనల్ ఓటర లిస్టు విడుదల చేస్తామన్నారు.

16వేల మంది ఓటర్లు

కోస్గి రూరల్: త్వరలో జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో ప్రాదేశిక ఎన్నికల డ్రాఫ్ట్ జాబితాను ఎంపీడీఓ శ్రీధర్ విడుదల చేశారు. మండల పరిధిలో మొత్తం 16805 మంది ఓటర్లు ఉండగా మహిళలు 8190 , పురుషులు 8614 మంది ఉన్నట్లు తెలిపారు.

కాల్వలు నిర్మించరు.. అవస్థలు తీర్చరు

- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- అగ్రిమెంట్ దశలో నిలిచిన వైనం
- ఇళ్ల మధ్యనే నిలుస్తున్న మురుగు

దామరగిద్ద: మండలకేంద్రంలో మురుగు పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. అభివృద్ధిలో భాగంగా మండలంలో రెండేళ్ల క్రితం స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ వరకు 270 మీటర్ల మేర రోడ్డు విస్తరణ చేపట్టారు. అయితే రోడ్డు విస్తరణలో భాగంగా సైడ్ డ్రైన్ నిర్మాణం చేపట్టక పోవడంతో మురుగు ముందుకు వెళ్లేందుకు ఆస్కారం లేకుండా పోయింది. దీంతో వర్షం కురిసినా ప్రతిసారి రోడ్డు కోతకు గురవుతుంది. అలాగే మురుగు ఇళ్ల మధ్యనే నిలిచి దుర్గంధం నెలకొంటుంది. సమస్యను గుర్తించినా అధికారులు రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రైన్ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.18 లక్షలు నిధులు కేటాయించారు. కాంట్రాక్టర్ టెండర్ దగ్గించుకున్నా అగ్రిమెంట్ చేసుకోక పోవడంతో కాల్వల పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. వీటితో పాటు నామినేషన్ పనుల్లో భాగంగా మండల కేంద్రమైన దామరగిద్దతో పాటు ఉద్మల్‌గిద్ద, మల్‌రెడ్డిపల్లి అన్నసాగర్ గ్రామాల్లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ మంజూరు చేసినా పనులు మాత్రం ముందుకు కదలడం లేదు.

కోతకు గురవుతున్న రోడ్డు

రోడ్డుకు ఇరువైపులా మురుగుకాల్వల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇటు ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీటితో పాటు వర్షాకాలంలో పెద్దఎత్తున మురుగు రోడ్డుకు ఇరువైపులా కాల్వలు ఉన్న నేలపై పారుతుండడంతో రోడ్డు కోతకు గురవుతుంది. రూ.కోట్ల నిధులతో నిర్మించినా రోడ్డు కోతకు గురవుతుంది. దీనికి తోడు మురుగునీటి పారుదల లేక మరో పక్క వర్షపు నీరు వెళ్లే మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పై నుంచి దాటేందుకు ఇళ్ల ముందు స్వచ్ఛందంగా కాల్వలను నిర్మించుకుంటున్నారు.



డ్రైన్ లేక రోడ్డుపై పారుతున్న మురుగు

కాల్వల నిర్మాణం చేపట్టాలి



గతంలో ఉన్న మురుగు కాల్వలు పూడిపోయి మురుగు నీరు వర్షాకాలంలో రోడ్డు పై పారుతుంది. వర్షపు నీరు ఇళ్ల మధ్య నిలిచి దుర్వాసన వస్తుంది. అలాగే దోమల బెడద అధికంగా ఉంటుంది. రోడ్డు నిర్మాణం చేపట్టి రెండేళ్లు గడిచినా మురుగు కాల్వలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి కాల్వలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి. -శేఖర్, దామరగిద్ద

దుర్గంధంతో అవస్థలు పడుతున్నాం



రోడ్డు నిర్మాణం చేపట్టి రెండేళ్లు అవుతున్నా కాల్వలు నిర్మించకపోవడంతో దుర్గంధం నెలకొంటుంది. ఈగలు, దోమలు వ్యాప్తితో విషజ్వరాలు ప్రబలే అవకాశం లేకపోలేదు. అధికారులు చొరవ తీసుకొని రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రైన్స్ నిర్మాణం చేపట్టాలి. -రవికుమార్, దామరగిద్ద

అగ్రిమెంట్ కాగానే పనులు ప్రారంభిస్తాం

మండల కేంద్రంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా 270 మీటర్ల పొడవు సైడ్ డ్రైన్‌ల నిర్మాణానికి రూ.18 లక్షలు ఎస్‌డీపీ నిధులు మంజూరు అయ్యాయి. మంజూరైన పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి కాగా అగ్రిమెంట్ పెండింగ్‌లో ఉంది. అగ్రిమెంట్ పూర్తి కాగానే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. -రమేశ్, పీఆర్‌ఏఈ, దామరగిద్ద